సాక్షి నిజామాబాద్

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025

శోభాయాత్రను ప్రారంభిస్తున్న మహేశ్ కుమార్ గౌడ్, యెండల తదితరులు



రథాన్ని ఎడ్లతో లాగుతూ..





గాంధీచౌక్‌లో గణనాథుని రథం వద్ద భక్తుల సందడి

రథంపై గణనాథులు

న్యూస్‌రీల్

నేడు చంద్రగ్రహణం

- ఆలయాల మూసివేత

నిజామాబాద్ రూరల్: సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని ప్రముఖ ఆలయాలను మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభులింగేశ్వరాలయం, జెండా బాలాజీ, మాధవనగర్ సాయిబాబా, నాందేవ్‌వాడలోని సంతోషిమాత, సాయిబాబా ఆలయాలు మూసి ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయాల సంప్రోక్షణ అనంతరం 7.30 గంటల నుంచి దైవ దర్శనానికి వీలుంటుందని తెలిపారు.

నేడు జెండా జాతర



నిజామాబాద్ రూరల్: జెండా జాతరలో భాగంగా ఆదివారం ఉదయం జెండాను పులాంగ్‌కు తరలించనున్నట్లు ఆలయ ఈవో వేణు శనివారం తెలిపారు. ప్రతి సంవత్సరం స్వామి వారి ఉత్సవమూర్తుల ఊరేగింపును సాయంత్రం నిర్వహించేవారు. ఈ ఏడాది చంద్రగ్రహణం దృష్ట్యా ఉదయం 9 గంటలకే ఆలయం నుంచి జెండా, స్వామి వారి ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా పులాంగ్‌కు బయల్దేరుతాయని ఈవో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సోమవారం ఉదయం 9 గంటలకు జాతర మహోత్సవానికి సంబంధించిన హుండీ ఆదాయ లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కామారెడ్డిలో బీసీ సంబరాలు

- 15న కాంగ్రెస్ బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలోనే బీసీ రిజర్వేషన్ సంబరాలు నిర్వహించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15న బీసీలతో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఇంట్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 2023 నవంబర్ 10న కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా బీసీ డిక్లరేషన్ సభ నిర్వహించారు. సభలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో పాటు రేవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లతోపాటు పలు హామీలతో బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో బీసీ రిజర్వేషన్లను అమలు చేయడానికి ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్‌కు పంపిన విషయం తెలిసిందే. రిజర్వేషన్లు అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పేర్కొంటోంది.

నేడు సన్నాహక సమావేశం

బీసీ రిజర్వేషన్ల సంబరాల సభకు సంబంధించి ఉమ్మడి జిల్లా నేతలతో ఆదివారం కామారెడ్డిలో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నేతలంతా హాజరుకానున్నారు. సభ సక్సెస్ కోసం తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లు, జనసమీకరణపై చర్చించి ఎవరు ఏ పని చేయాలన్నదానిపై దిశానిర్దేశం చేస్తారు.

ఉండ్రాలయ్యా.. ఉంటామయ్యా..

- గంగమ్మ ఒడికి గణపయ్య
- అట్టహాసంగా వినాయక నిమజ్జనం
- శోభాయాత్రతో పులకించిన ఇందూరు వీధులు
- మార్మోగిన 'గణేశ్ మహారాజ్‌కీ.. జై' నినాదాలు

నిజామాబాద్ రూరల్: పది రోజులపాటు భక్తుల పూజలందుకున్న లంబోదరుడు.. గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక నామ స్మరణతో ఊరూవాడా మారుమోగింది. 'గణేశ్ మహారాజ్‌కీ జై.. గణపతి బొప్పా మోరియా అంటూ భక్తులు హోరెత్తించారు. నిజామాబాద్‌నగరంలో సార్వజనిక్ గణేశ్ మండలి శోభాయాత్ర ఆద్యంతం శోభాయమానంగా సాగింది. అడుగడుగునా భక్తులు నీరాజనం పలికారు. 21 జతల ఎడ్లు రథానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగరంలోని దుబ్బ సార్వజనిక్ గణేశ్ మండలి రథానికి రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, సీపీ సాయిచైతన్య తదితరులు జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. భక్తుల కోలాటాలు, డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాల మధ్య ఊరేగింపు కొనసాగింది. దుబ్బ నుంచి లలితామహల్, రైల్వేగేట్, గాంధీచౌక్, నెహ్రూ పార్క్, గురుద్వారా, పెద్ద బజార్, గోల్ హన్మాన్, పులాంగ్ చౌరస్తా మీదుగా వినాయక్‌నగర్ వినాయకుల బావి వరకు శోభాయాత్ర కొనసాగింది. మూడు అడుగుల కంటే తక్కువగా ఉన్న గణేశ్ విగ్రహాలను వినాయకుల బావి వద్ద నిమజ్జనం చేయగా, భారీ విగ్రహాలను బాసర, ఉమ్మెడకు తరలించారు.



వినాయక్‌నగర్ గణపతుల బావిలో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



స్వాగతం పలికిన సంస్కార భారతి

గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా గోల్ హనుమాన్ వద్ద వివిధ మండపాల నిర్వాహకులకు సంస్కార భారతి ఇందూరు ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. నగరంలో వెలసిన గణేశ్ మండపాలలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఉత్తమ గణేశ్ మండలి పురస్కారాలు అందించినట్లు సంస్కార భారతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్ సుబేదార్, కార్తిక్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు చామకూర శ్రీనివాస్ రెడ్డి, కందకుర్తి ఆనంద్, నగుర్తి శంకర్, సూరం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువులో క్రేన్ సహాయంతో గణేశ్ నిమజ్జనం

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

గణపతి ఆశీర్వాదంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గణేశ్ ఉత్సవాలు మహారాష్ట్రలోని ముంబై తర్వాత నిజామాబాద్ జిల్లాలోనే జరుగుతాయన్నారు. 60 సంవత్సరాల నుంచి సార్వజనిక్ గణేశ్ మండలి వినాయక నవరాత్రులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా ఉత్సవాలు జరుపుకోవడం తెలంగాణ రాష్ట్రంలో ఆనవాయితీగా వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు నగేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నిఘా.. : సీపీ సాయిచైతన్య



ఖలీల్‌వాడి: జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనానికి పోలీసులతోపాటు సీసీటీవీ కెమెరాలు వినియోగించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య తెలిపారు. నగరంలోని వినాయక్‌నగర్ వినాయకుల బావి వద్ద శనివారం ఆయన బందోబస్తును పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామన్నారు. శోభాయాత్ర రూట్లలో సీసీటీవీలు ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. బాసర, ఉమ్మెడ వద్ద క్రేన్‌లు అందుబాటులో ఉంచామన్నారు.





రథం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



దుబ్బలో రథం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య, అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ



కారుపై 30 గణనాథులను తీసుకెళ్తున్న భక్తులు



ఉమ్మెడ బ్రిడ్జి వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఈజీఎస్ కూలీలతో ఇసుక మేటల తొలగింపు

- పంట నష్టంపై నివేదికలను పరిశీలించిన కలెక్టర్
- వ్యవసాయ, హౌసింగ్ శాఖల పనితీరుపై సమీక్ష

నిజామాబాద్ అర్బన్/నిజామాబాద్ సిటీ: నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీవోసీ)లోని పలు శాఖల కార్యాలయాలను శనివారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయ, హౌసింగ్ కార్యాలయాలను సందర్శించి ఆ శాఖ ల పనితీరును సమీక్షించారు. భారీ వర్షాలకు జిల్లాలో జరిగిన పంట నష్టంపై రూ పొందించిన నివేదికల ను పరిశీలించారు. బాధిత రైతులకు ప్రభుత్వ పరంగా సహాయం అందేలా వివరాలు పొందుపర్చాలని సూచించారు. సిరికొండ, ధర్పల్లి, భీమ్‌గల్, ఇందల్వాయి, వేల్పూర్, వర్ని మండలాల్లోని పలు పొలాల్లో ఇసుక మేటలు వేసిందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈజీఎస్ కూలీలతో ఇసుక మేటలు తొలగింపజేసేలా చర్య లు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏవో లు, ఏఈవోలు, ఇతర వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇసుక మేటలు వేసిన పంట భూముల వివరాలను ఉపాధి హామీ అధికారులకు అందిస్తే, వారు కూలీలతో తొలగింపజేస్తారన్నారు. అన్ని జీపీల పరిధిలో విరివిరిగా పనులు గుర్తిస్తూ, వాటిని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో సాయాగౌడ్‌ను ఆదేశించారు. అనంతరం హౌసింగ్ శాఖలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. లబ్ధిదారు లందరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జె.గోవిందు, హౌసింగ్ పీడీ పవన్‌కుమార్, ఈఈ నివర్తి తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

మెరుగైన సేవలందించాలి..

నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ప్రత్యేకాధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం సందర్శించారు. కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల పనితీరుపై కమిషనర్ దిలీప్‌కుమార్‌తో సమీక్షించారు. నగరపాలక సంస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

174 ఎకరాల గుర్తింపు

మోర్తాడ్(బాల్కొండ): వరదల కారణంగా పంట పొలాల్లో వేసిన ఇసుక మేటలను ఉపాధి కూలీలతో తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 174 ఎకరాల్లో ఇసుక మేటలు వేసినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. భీమ్‌గల్, వేల్పూర్, వర్ని, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల్లోని పంట పొలాల్లో ఇసుక వచ్చి చేరింది. కాగా, సిరికొండ మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి కాలేదు. ఇసుక మేటలు వేసిన పంట పొలాలను ఎంపీడీవో, మండల వ్యవసాయాధికారి, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు పరిశీలించి అంచనాలను తయారు చేస్తున్నారు. అనంతరం ఉపాధి కూలీలకు ఇసుకను తొలగించే పనులు అప్పగించనున్నారు.



బడా భీమ్‌గల్‌లో పొలాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

వివరాలను అందిస్తున్నాం

ఇసుక మేటలు వేసిన భూముల వివరాలు, రైతుల సమాచారాన్ని నివేదిక రూపంలో తయారు చేసి ఉపాధి హామీ అధికారులకు అందిస్తున్నాం. సిరికొండ మండలం మినహా ఇతర మండలాల సమాచారం అందించాం. ఈ మండలంలో సర్వే పూర్తి కాగానే ఆ వివరాలనూ అందిస్తాం. – మేకల గోవింద్, డీఏవో

అంచనాల తయారీకి ఆదేశించాం

ఇసుక మేటలు వేసిన పంట పొలాలను పరిశీలించి అంచనాలు తయారు చేయాలని ఆదేశించాం. క్షేత్రస్థాయిలో పరిశీలన జరుగుతోంది. అంచనాలను రూపొందించిన తర్వాత పనులు మొదలుపెడతారు. రైతులకు భారం తప్పించేందుకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

– సాయాగౌడ్, డీఆర్డీవో

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని జిల్లా క్రీడా మైదానంలో శనివారం ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా బాల్‌ బ్యాడ్మింటన్‌ సంఘం ఆధ్వర్యంలో బాలుర, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించి ఉమ్మడి జిల్లా తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తుది జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12 నుంచి 14 వరకు జనగాం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్‌ బాల, బాలికల బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా అధ్యక్షుడు మానస గణేష్‌, కార్యదర్శి శ్యామ్‌, కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ నాగేష్‌, కార్యవర్గం సభ్యులు భాగ్యశ్రీ,, సీనియర్‌ క్రీడాకారులు ఆనంద్‌, కార్తీక్‌, జిల్లా వ్యాయమ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న బీఈడీ, ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం జరిగిన బీఈడీ 2, 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో మొత్తం 279 మంది విద్యార్థులకు గానూ 261 మంది హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఎంఈడీ 1, 2, 3, 4వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌, 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల్లో ఒక విద్యార్థి హాజరైనట్లు ఆయన తెలిపారు.

నిండుకుండలా ఎస్సారెస్పీ



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టును పూర్తిస్థాయి నీటినిల్వకు అధికారులు పెంచారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి నిల్వ 80.5 టీఎంసీలతో నిండుకుండలా ఉంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. 27వేల 650 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా 18 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, ఎస్కెప్‌ గేట్ల ద్వారా 2500 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది.

మలేషియాలో బతుకమ్మ సంబురాలకు జిల్లావాసికి ఆహ్వానం



ఆర్మూర్‌: మలేషియా దేశంలోని కౌలాలంపూర్‌లో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించనున్న బతుకమ్మ, దసరా సంబురాలకు హాజరుకావాలని ఆర్మూర్‌కు చెందిన నటరాజ నృత్య నికేతన్‌ నాట్య గురువు బాశెట్టి మృణాళినికి శనివారం ఆహ్వానం అందింది. తమ విద్యార్థులతోపాటు వారు హాజరై గౌరవ ప్రదమైన సన్మానాన్ని పొందాలని యునైటెడ్‌ హెరిటేజ్‌ ఆర్ట్స్‌ అండ్‌ కల్చర్‌ ఆర్గనైజేషన్‌ తరపున ఆహ్వానించినట్లు నిర్వాహకులు దేవులపల్లి పవన్‌ వివరించారు. ఈ ఆహ్వానంతో శిక్షణ పొందుతున్న చిన్నారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





సాలూరలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు.. నగరంలోని దుబ్బలో సార్వజనిక్‌ గణేశ్‌ మండలి రథాన్ని లాగుతున్న ప్రజలు.. బోధన్‌లో గణేష్‌ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి, నాయకులు

శోభాయమానంగా..

జిల్లావ్యాప్తంగా శనివారం గణేశ్‌ నిమజ్జనోత్సవాలు శోభాయమానంగా జరిగాయి. జిల్లాకేంద్రంతోపాటు అన్ని మండలాలు, గ్రామాల్లో గణేశ్‌ మండపాల నిర్వాహకులు వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి, వినాయకులను నిమజ్జనానికి తరలించారు. ఈసందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో యువతతోపాటు, చిన్నారులు, మహిళలు నృత్యాలు, కోలాటాలు ఆడుతూ ఆకట్టుకున్నారు. అనంతరం స్థానిక చెరువుల్లో గణపయ్యలను నిమజ్జనం చేశారు.

–సాక్షి నెట్‌వర్క్‌



గణపతుల బావిలో గణనాథుడు

నగరంలో గణపతిని నిమజ్జనానికి తీసుకొని వస్తున్న చిన్నారి





దొంకేశ్వర్‌లో ప్రత్యేక రథంపై సత్య (కర్ర) గణపతి







నగరంలో గణపతులను నిమజ్జనానికి తీసుకొని వస్తున్న చిన్నారులు, యువతులు

గణేశుడికి సీపీ సాయిచైతన్య పూజలు




ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని నిజామాబాద్‌ పోలీస్‌ హెడ్‌ క్వార్టర్‌లో శ్రీ ఓం గణేష్‌ మండలి వారు ఏర్పాటు చేసిన గణేశుడికి శనివారం సీపీ పోతరాజు సాయిచైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. ఆదనపు డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ, రిజర్వ్‌ సీఐలు శ్రీనివాస్‌, శేఖర్‌ బాబు, తిరుపతి, స్పెషల్‌ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినాయక్‌నగర్‌లోని గణపతుల బావిలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తుడు



గణపతుల బావిలో గణనాథుడి నిమజ్జనం






స్కూటీ, కారులో గణపతులను నిమజ్జనానికి తీసుకొని వస్తున్న భక్తులు.. గణపతులతో మహిళలు




ముప్కాల్‌ మండలం రెంజర్లలో శోభాయాత్రలో నృత్యం చేస్తున్న యువకులు.. ఆర్మూర్‌లో..



పడకల్‌లో..

మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలి



సాలూర క్యాంప్‌లో రైతులు, కాంగ్రెస్‌ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి

ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌ రెడ్డి

బోధన్‌: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లకు, విద్యుత్‌ లైన్లకు మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని బోధన్‌ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌ రెడ్డి అధికారులను ఆదేశించారు. సాలూర మండలంలోని సాలూర క్యాంప్‌లో శనివారం ఆయన మందర్నా, హున్సా, ఖాజాపూర్‌, సాలూర, తగ్గెల్లి గ్రామాలతోపాటు ఇతర గ్రామాల్లో వరదలతో జరిగిన నష్టాలపై, పునరుద్ధరణ పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల రైతులు, కాంగ్రెస్‌ ప్రజాప్రతినిధులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్‌, తాగునీటి సౌకర్యాలకు సంబంధించిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. పంట నష్టం వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ చీల శంకర్‌, టీపీసీసీ డెలిగేట్‌ గంగాశంకర్‌, అధికారులు ముక్తార్‌, వెంకటేశ్వర్లు, మున్నినాయక్‌, శశిభూషణ్‌, శ్రీనివాస్‌, శ్వేత, నాయకులు మొబిన్‌ఖాన్‌, మందర్నా రవి, నాగేశ్వర్‌ రావు, పులి శ్రీనివాస్‌, నాయకులు అల్లె రమేష్‌, చిద్రపు అశోక్‌, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి నరేందర్‌ రెడ్డి పాల్గొన్నారు.

నత్తనడకన ఆర్‌యూబీ పనులు

- నవీపేట మండలంలో మూడు చోట్ల నిర్మాణాలకు నిధుల కేటాయింపు
- పనుల్లో కనిపించని పురోగతి



ధర్మారం(ఏ) వద్ద ఆర్‌యూబీ కోసం తవ్విన గుంతలో నిలిచిన వర్షపు నీరు



మహంతం వద్ద ఓ వైపు తవ్వి వదిలేసిన వైనం



ధర్యాపూర్‌లో మొరం తవ్వకం పనులు

నవీపేట: రైల్వే సేవల విస్తరణలో భాగంగా రైల్వే శాఖ ఇటీవల పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది.అందులో భాగంగా నవీపేట మండల పరిధిలో రైలు పట్టాల పెంపు, అవసరమైన చోట ఆర్‌యూబీ(రైల్వే అండర్‌ బ్రిడ్జి) పనులను నాలుగు నెలల కిందట ప్రారంభించింది. రైల్వేట్రాక్‌ (బ్రాడ్‌గేజ్‌) లైన్‌ విస్తరణలో భాగంగా రైల్వేగేట్‌లను తొలగించాలని నిర్ణయం తీసుకుని ముందడుగు వేసింది. కానీ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రైల్వే గేట్ల ఇబ్బందులు తొలగించడానికి..

మండలంలోని ధర్యాపూర్‌, మహంతం, ధర్మారం (ఏ),నాగేపూర్‌, ఫకీరాబాద్‌, మిట్టాపూర్‌ గ్రామాలలో రైల్వేగేట్‌లు ఉన్నాయి. రైలు వస్తున్న సమయంలో ఈ గేట్లు వేయడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. నవీపేట, రెంజల్‌, నందిపేట, ఎడపల్లి, నిజామాబాద్‌ సరిహద్దు గ్రామాలకు చెందిన వేలమంది ప్రయాణికులు ఈ రహదారుల వెంబడి నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను తప్పించాలనే నేపథ్యంలో రైల్వేశాఖ ఆర్‌యూబీ పనులకు శ్రీకారం చుట్టింది.

రూ.15 కోట్ల నిధులు..

మొదట ధర్యాపూర్‌, మహంతం, ధర్మారం(ఏ) గ్రామాలలోని రైల్వేగేట్లను తొలగించాలనే లక్ష్యంతో ఈ మూడు ప్రాంతాలలో ఆర్‌యూబీ పనులను ప్రారంభించింది. రూ. 5 కోట్ల చొప్పున మూడు ఆర్‌యూబీ పనులకు మొత్తం రూ. 15 కోట్లు నిధులను ఆరు నెలల కిందట కేటాయించారు. నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభ మయ్యాయి. కానీ పనులలో వేగం పుంజుకోవడం లేదు. ధర్మారం(ఏ) వద్ద ఒకవైపు తవ్వి వదిలేయగా అందులో పూర్తిగా వర్షపు నీరు నిలిచింది. మహంతం ప్రాంతంలో ఒక వైపు పనులను ప్రారంభించినా మందకొడిగా సాగుతోంది. ధర్యాపూర్‌లో ఒక వైపు మొరం తవ్వి పనులు చేస్తున్నారు. మరోవైపు కొద్దిమేర సీసీ వేసి వదిలేశారు. రైల్వే అధికారుల అజమాయిషీ కరువవ్వడంతో సంబంధిత గుత్తేదారులు ఇష్టానుసారం పనులు నిర్వహిస్తున్నారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి కావాల్సి ఉండగా ఎలాంటి పురోగతి కనపించడం లేదు. పనులు చేపట్టడంతో సంతోషపడిన చుట్టు పక్కల గ్రామాల వాసులు పనులు మందకొడిగా సాగడంతో ఇబ్బంది పడుతున్నారు. తాత్కాలికంగా గేట్లు మూసివేయడంతో దూరభారం పెరిగి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌యూబీ పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తిరిగి వెళ్లాల్సి వస్తోంది

రాంపూర్‌లో బీడీ కార్ఖానా నడిపిస్తాను. వృత్తిరీత్యా ప్రతిరోజు రాంపూర్‌ నుంచి పోతంగల్‌కు ధర్యాపూర్‌ గేటు మీదుగా రాకపోకలు సాగిస్తాను. కొన్ని నెలలుగా గేటును మూసివేశారు. రెంజల్‌ మండలంలోని కళ్యాపూర్‌ మీదుగా పోతంగల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అండర్‌ గ్రౌండ్‌ మార్గాన్ని నిర్మిస్తున్నారని సంతోషపడ్డాం. కానీ పనులను ఆలస్యంగా నిర్వహిస్తున్నారు.

–బైండ్ల శ్యామ్‌, రాంపూర్‌

వేగవంతం చేయాలి..

మా గ్రామం నుంచి నవీపేట, నిజామాబాద్‌లకు వెళ్లాలంటే మహంతం రైల్వే గేటు మీదుగా వెళ్తాం. ప్రస్తుతం రైల్వే గేటును ఆర్‌యూబీ పనుల నిమిత్తం మూసి వేశారు. దీంతో కమలాపూర్‌ మీదుగా తిరిగి వెళ్తున్నాం. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి ఆర్వోబీ పనులను వేగంగా నిర్వహిస్తే బాగుంటుంది.

–సతీష్‌, మహంతం

ఆలయంలో చోరీ



మాక్లూర్‌: మండలంలోని అమ్రాద్‌ తండాలోగల వీర హనుమాన్‌ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు తండావాసులు తెలిపారు. ఆలయం తాళాలను పగులగొట్టి, ఆలయంలోని బీరువాలో ఉన్న అరకిలో వెండి కిరీటంతోపాటు చేతిలో ఉన్న గదను అపహరించుకపోయారు. అంతేకాకుండా ఆలయంలో పసుపు, కుంకుమ కలిపి వండిన అన్నం ఉండటంతో తండాకు ఏదైన కీడు జరగాలని దుండగులు ఇలా చేసి ఉంటారేమోనని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై ఆలయ చైర్మన్‌ మూడ గోవింద్‌నాయక్‌ మాక్లూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు



అభినాష్‌ మృతదేహం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌ చౌరస్తాలోగల 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మెండోరా ఎస్సై జాదవ్‌ సుహాసిని తెలిపిన వివరాలు ఇలా.. నిర్మల్‌ జిల్లా సోన్‌ మండలం గాంధీనగర్‌కు చెందిన సాస్కిన్‌ అభినాష్‌(25) శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై తన బంధువుల పిల్లలైన రుసునకంటీ గణేష్‌, ఆంబ్లే లోకేష్‌లతో కలిసి శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ దిగువన గోదావరిలో చేపలు వేటాడడానికి వచ్చారు. వేట ముగిసిన తర్వాత అర్ధరాత్రి వేళ బైక్‌పై ఇంటికి బయలుదేరారు. పోచంపాడ్‌ చౌరస్తాలోగల హైవేపై వీరి బైక్‌ను ఆర్మూర్‌ నుంచి నిర్మల్‌ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ముగ్గురు కిందపడ్డారు. ఈ ఘటనలో బైక్‌పై మధ్యలో కుర్చున్న అభినాష్‌ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు కాగా నిర్మల్‌జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంజీర బ్రిడ్జికి వేలాడిన మృతదేహం

బోధన్‌రూరల్‌: మంజీర నది బ్రిడ్జికి శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వేలాడుతూ కనిపించడంతో కలకలం రేపింది. అటువైపుగా వెళ్లిన కొందరు ప్రయాణికులు మృతదేహాన్ని గమనించి బోధన్‌ రూరల్‌ పోలీసులు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని, పరిసరాలను పరిశీలించారు. ఘటన స్థలం మహారాష్ట్ర పరిధిలోకి రావడంతో మహారాష్ట్ర పోలీసులకు సమాచారం అందించారు.

స్వగ్రామం చేరిన అన్వేష్‌రెడ్డి మృతదేహం



అన్వేష్‌రెడ్డి మృత దేహం

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన సామ అన్వేష్‌రెడ్డి(30) పది రోజుల క్రితం గుండెపోటుతో ఐర్లాండ్‌లో మృతి చెందాడు. ఆయన మృతదేహం శనివారం ఉదయం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబసభ్యుల రోధనలు మధ్యే అంత్యక్రియలను నిర్వహించారు. అన్వేష్‌రెడ్డి నాలుగు నెలల క్రితమే సెలవుపై వచ్చి వివాహం చేసుకుని ఇటీవల వెళ్లాడు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య



ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే స్టేషన్‌ ఎదురుగా ఉన్న ఓ కిరాణా దుకాణం ముందర ఒక గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు వన్‌ టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. సదరు కిరాణ దుకాణం వద్ద మృతదేహం పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని, అతడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మృతుడి మెడకు బట్ట, సుతిలితో ఉరి బిగించి ఊపిరి ఆడకుండా చేసి చంపినట్లు కనపడుతోందన్నారు. మృతుడు బ్లాక్‌ కలర్‌ ఫుల్‌ షర్ట్‌, గ్రే కలర్‌ ప్యాంటు ధరించి ఉన్నాడని, అతని వద్ద ముస్లింలు ధరించే టోపీ ఉందన్నారు. ఘటనపై భగవాన్‌కాలనీకి చెందిన వెనిశెట్టి శ్రీనివాస్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే వన్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ ఫోన్‌ నంబర్‌ 8712659714కు సమాచారం అందించాలన్నారు.

ముత్యాల చెరువు పరిశీలన



ధర్పల్లి: మండలంలోని హోన్నాజీపేట్‌ అటవీ ప్రాంతంలోగల ముత్యాల చెరువు కట్ట ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోవడంతో ఆ ప్రదేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌ అంకిత్‌, ఇరిగేషన్‌ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం బీరప్ప తండాలో నష్టపోయిన పంటలను, ఇళ్లను, రోడ్లను పరిశీలించారు. బీరప్పతండాకు అదన కలెక్టర్‌ వచ్చిన విషయాన్ని తెలుసుకున్న వాడి, హోన్నాజీపేట్‌ ప్రజలు ఆయన వద్దకు వచ్చారు. ముత్యాల చెరువు కట్ట నిర్మాణం మళ్లీ చేపడితే తమ గ్రామాలు మళ్లీ ముంపునకు గురవుతాయని ప్రజలు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. ఎట్టి పరిస్థితుల్లో కట్ట నిర్మాణం చేపట్టవద్దని ఆందోళన చేపట్టారు. తమ సమస్యను కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లి పరిస్థితులను వివరిస్తానని అదనపు కలెక్టర్‌ హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు. ఆర్డీవో వినోద్‌, ఇరిగేషన్‌ ఎస్‌ఈ రామారావు, ఈఈ నరేందర్‌, డీఈ ప్రేమ్‌ కుమార్‌, ఎంపీడీవో లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

- నలుగురికి తీవ్ర గాయాలు

కామారెడ్డి క్రైం: గణేష్‌ శోభాయాత్ర కోసం తీసుకువెళ్తున్న ట్రాక్టర్‌ ట్రాలీని లారీ ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డికి సమీపంలోని క్యాసంపల్లి వద్ద ప్రధాన రోడ్డుపై శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. రామారెడ్డి నుంచి ట్రాక్టర్‌ ట్రాలీని కొందరు యువకులు కలిసి దోమకొండకు తీసుకువెళ్తున్నారు. ఈ సమయంలో నలుగురు యువకులు ట్రాక్టర్‌ ఇంజిన్‌పై కూర్చుని ప్రయాణిస్తున్నారు. క్యాసంపల్లి వద్ద వారి ట్రాక్టర్‌ను ఓ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దోమకొండకు చెందిన సాయికుమార్‌, శ్రీధర్‌, రాజయ్య, శివకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వారిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో శ్రీధర్‌ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.